# ఈలా – ఇల్లాలూ

వుండమాటి సూర్యం

**మగవాడు ఈల వేసి ఆడదానిని కవ్వించడం కాపీ రైటు హక్కుగా భావించే నేటి సమాజంలో ఆడదాని నోటిలోంచి ఈల వినిపిస్తే తరవాత జరిగే కథ ట్రాజెడీయా? కామెడీయా?**

"తాయారూ" అని గట్టిగా అరిచాడు పాపారావు. జబ్బమీదఉన్న పురుగుని దులిపేసుకుంటూ నిర్లక్ష్యంగా చూసింది తాయారు. "నిన్నింట్లో ఈల వేసుకుంటూ తిరగొద్దన్నానా?" అన్నాడు కోపంగా.

"అం[illegible] అంగమునా దానర్థం?" అంటూ వీథిలోకి పోబోయింది తాయారు. చెయ్యి పట్టుకొని ఆపుచేసి బాధగా— "తాయారూ! నన్నిలా ఎందుకు బాధ పెడుతున్నావో తెలియడం లేదు. నువ్వెందుకులే — నేనే వెడుతున్నాను" అని బయటికి నడిచాడు పాపారావు.

దారిలో పాపారావుకి ఖాన్ ఎదురయ్యాడు. "ఏరా, పాపారావ్, ఈ రోజు సెషన్స్‌కి రావా? టూ ఫోర్స్ ఆడదాం. రాఘవగాడు కూడా వచ్చాడు" అని ఆహ్వానించాడు పాపారావు. విషాదంగా "సారీరా, ఖానూ. ఈ రోజు నా మనస్సేం బాగాలేదు. నీ వెళ్ళి రా" అన్నాడు.

ఖాన్ వెంటనే ఆముదం తాగినవాడి మొహంలా తన మొహాన్ని మార్చేసుకుని — "అరెరే, పాపం, నీ మనస్సు కేమయిందిరా?" అన్నాడు. పాపారావుకి ఒళ్ళు మండింది. కోపంగా "ఒరేయ్, వెధవ్వేషాలు వెయ్యకు. నీ వెంత తైరు కొట్టినా నీకు నయాపైసా అప్పివ్వను. అందులోనూ పేకాటకి" అన్నాడు. ఖాన్ 'ఛా! ఎత్తు పారలేదు' అనుకొని వెళ్ళిపోయాడు.

పాపారావు తిన్నగా నడిచి పార్కులోకి వెళ్ళాడు. పొగడ చెట్టు క్రింద ఉన్న సిమెంటు బెంచీ మీద కూర్చొని ఆలోచించడం మొదలుపెట్టాడు.

తాయారు ఎందు కిలా చేస్తుంది? అస లీ అలవాటు తాయారు కెలా వచ్చింది? అని తర్కించుకొన్నాడు. ఇదేదో అంతుపట్టని సమస్యలా మిగిలిపోయింది. సరే ... ఆలోచనల్లో పాపారావుని వదిలిపెట్టేసి అతని గత చరిత్రని పరికిద్దాం.

● ● ●

**పాపారావు అసలు పేరు పాపారావే. నాలుగయిదు సంవత్సరాలు కాపీ కొట్టి చివరికి ఎలాగయితేనేం బి. ఎ. పాసయ్యాడు. ఉద్యోగాంకోసం వెదతిరిగి చివరికి వ్యవసాయమే మంచిదని వాళ్ళ ఊరు కొత్తపల్లి పోయాడు. తీరా కాడి పట్టుకొనేసరికి 'స్టేట్ బాంక్' నుంచి** ఇంటర్వ్యూ వచ్చేసరికి 'కాడి' వదిలేసి కాకినాడ పరుగెత్తుకొచ్చాడు. ఎలాగయితేనేం కాకినాడలో ఉద్యోగం సంపాదించ గలిగాడు.

పాపారావు భూమికి ఓ అయిదడుగుల ఎత్తులో ఉంటాడు (అపార్థం చేసుకోకండి. పాపారావు దయ్యమని పోయాడని నా ఉద్దేశం కాదు). నల్లగా ఉన్నా కనుముక్కు తీరూ అదీ బాగుంటుంది. పోతే, కొంచెం పిరికి గుండె.

**బాంకిలో ఉద్యోగం అనగానే పెళ్ళికూతుళ్ళ తండ్రులు ఎగబడ్డారు. చివరికి నాలు గెకరాలూ, పదివేల రూపాయలతో అలివేలుమంగ తాయారుని పెళ్ళాడాడు.**

తాయారు చిన్నతనం నుంచీ చాలా గారాబంగా పెరిగింది. ఒక్కతే కూతురు అవడం వల్ల 'ఆడింది ఆట, పాడింది పాట'గా సాగుతుండేది. అసలు తాయారుకి ఈల వేయడం అనే అలవాటు ఎలా వచ్చిందీ— అంటే అదో కథ.

చిన్నప్పుడు తాయారూ, వాళ్ళ స్కూల్లో అమ్మాయిలంతా డ్రామా వేద్దామనుకొన్నారు. ఆ డ్రామాలో తాయారు రౌడీ! ఆ రౌడీ ఒక చోట ఈల వేయాలి. ఎలాగయినా ఈల వేయడం నేర్చుకోవాలి అనుకొంది. వాళ్ళ మాస్టారు మాత్రం "నీ కెందు కమ్మా, శ్రమ. నీవు ఈలవేసే సమయానికి తెర వెనక నుంచి వేయిస్తాను" అన్నారు.

"ఎందుకండీ? ఎలాగయినా నేర్చుకొనే పూచీ నాది" అంటూ ఇంటికి వెళ్ళి వాళ్ళ అన్నయ్యను వేపుకు తింది. వాళ్ళ నాన్న రెండు వడ్డించినా విడవకుండా నిరాహార దీక్ష సాగించి పంతం నెగ్గించుకుంది. ఎలాగయితేనేం తాయారు ఇంట్లో రెండు రోజులపాటు ఈల ప్రాక్టీసు సాగింది. అలా నేర్చుకున్న ఈ విద్య ఇలా లోతుగా పాతుకుపోయి పాపారావు మనసులో కలతలు రేపుతూంది. దానికి తోడు చిన్నతనం నుంచీ గారాబంగా పెరిగిందేమో మొండిమనిషై కూర్చుంది.

ఉన్నట్టుండి అంతవరకూ నిశ్శబ్దంగా ఉన్నదల్లా చటుక్కున విజిల్ వేస్తుంది తాయారు. ఉలిక్కిపడి చూస్తాడు పాపారావు. ఎంతో బాధవేస్తుంది. కోపం కూడా వస్తుంది. కానీ, ఏం చేస్తాడు? పదివేలకి అమ్ముడుపోయాడు. ఏమయినా అంటే "మీరు రమ్మంటే రావడానికి, పొమ్మంటే పోవడానికి మిమ్మల్ని పెళ్ళాడా ననుకున్నారా? పదివేలిచ్చి మరీ పెళ్ళి చేశాడు మా నాన్న" అని మొదలు పెడుతుంది. ఏమీ చేయలేని మగాళ్ళందరిలాగే పాపారావు కూడా భార్యకి 'పట్టె మూర్ఖపు మనిషి' అని బిరుదిచ్చుకొని, 'ఇంక వాదాలెందుకు?' అని సరిపెట్టుకున్నాడు.

అంద రాడవాళ్ళూ ఏవో కీర్తనలో, లేకపోతే కనీసం సినిమా పాటలో పాడుకుంటూ పని చేసుకుంటారు. కానీ, తాయారు మాత్రం వంటింట్లోనేమిటి, బయట వరండాలో కూడా అప్పుడప్పుడు విజిల్ వేస్తూ చేతులు వెనక్కి కట్టుకొని పచార్లు చేస్తూ ఉంటుంది. పాపారావుకి మతి పోతూ ఉంటుంది.

**అంతెందుకు? ఎవరన్నా స్నేహితులు** వచ్చినప్పుడు చూడాలి — పాపారావు అవస్థ. చచ్చిన చావు అవుతుంది. పాపారావు,మాట్లాడుతున్నవాడల్లా లోపలి నుంచి ఈలపాట ఏదైనా వినిపించగానే, తను మాట్లాడ్డం మానేసి ఈలవేయడం మొదలు పెడతాడు. అవతలి వాడు తలమునక లయ్యేంతగా ఆశ్చర్యపోయి 'ఇప్పటివరకూ బాగానే మాట్లాడాడు కదా! ఇంతలోనే ఏమొచ్చింది?' అనుకొని పాపారావు వైపు భయం భయంగా చూస్తాడు. స్నేహితుడి అవస్థ గమనించి పాపారావు మొహం ఆముదం తాగినట్లు అయిపోయినా విజిల్ మాత్రం తాయారు లోపల ఆపుచేసేంత వరకు ఆపడు. పోనీ, తను గట్టిగా మాట్లాడి లోపలినుంచి విజిల్ వినిపించకుండా చెయ్యచ్చు కదా అనే అనుమానం ఇక్కడ రాకూడదు. ఎందుకంటే, రైలుకూత కూడా తాయారు విజిల్‌ని డామినేట్ చేయలేదు.

విజిల్ వేస్తున్నట్లు నటించడం అనేది పాపారావు ఒరిజనల్ ఐడియా కాదు. వాళ్ళ మామగారిది. ఆయన దాన్ని పాపారావు మీద ప్రయోగించి కూతుర్ని ఇచ్చి పెళ్ళి చేశాడు.

పెళ్ళి చూపులకి వచ్చి కుర్చీలో కూర్చుని ఉన్న కుర్రవాడిని చూసి సరదాగా విజిల్ వేసేది తాయారు (మనసులో ఇంకే ఉద్దేశమూ లేదు స్మండీ). దానితో ఆ కుర్రాడూ, మిగతా పెద్దలూ బేజారెత్తి వెళ్ళిపోయేవారు. తాయారు నాన్న గారు నెత్తీ నోరూ కొట్టుకొనే వారు. ఇలా రెండు మూడు సంబంధాలు తప్పిపోయాక తాయారు అన్నయ్య వీరేంద్రకి ఒక మంచి ఐడియా వచ్చింది. తాయారు నాన్న దగ్గరికి వెళ్ళి "నాన్నా, ఈ సారి వచ్చే సంబంధం మనకి సెటిల్ అయిపోయినట్టే. పెళ్ళివాళ్ళని చూసుకోవడానికి రమ్మను" అన్నాడు.

"ఎలారా?" అన్నాడు వాళ్ళ నాన్న. "నేను చెపుతాగా" అని భరోసా ఇచ్చేశాడు వీరేంద్ర.

ముందు పాపారావు తాలూకు పెద్దలు వచ్చి చూసుకున్నారు. అదృష్టవశాత్తూ అప్పుడేమీ గొడవ చెయ్యలేదు మంగ

తాయారు. ఆ తరవాత కొద్ది రోజులకు పాపారావు కొద్ది మంది ఫ్రెండ్స్‌తో, అంటే ఖాన్, రాఘవేంద్ర, సూర్యంలతో అమ్మాయిని చూసుకోవడానికి వచ్చాడు.

శుభ్రంగా కడుపునిండా టిఫిన్ తిన్న తరవాత బ్రేవ్ మని తేన్చి అమ్మాయి కోసం ఎదురుచూడసాగాడు పాపారావు. అంతలో తాయారు వచ్చింది. పాపారావును చూడగానే సరదాగా విజిల్ వేసింది. అంతలోనే పక్కనున్న వీరేంద్ర తను కూడా గట్టిగా విజిల్ వేసేడు. పాపారావు చతుష్టయం ఈ విషయాన్ని గమనించలేకపోయారు. 'తాయారు అన్నయ్యే ఇంత మానర్లెస్‌గా విజిల్స్ వేస్తే ఏమిటూ?' అని జాలిపడ్డారు కూడాను. అలా పాపారావు 'విక్టిమ్' అయిపోయాడు.

ఆ తరవాత వీరేంద్ర బావగారికి ఈ సలహా చెప్పి స్నేహితుల బారి నుంచి తప్పుకొనే మార్గం బోధించాడు.

పాపారావుకి తన భార్య అలవాటు సంగతి ఎలా తెలిసిందంటే అదీ ఒక పెద్ద కథే.

మొదటి రోజు రాత్రి ...

పందిరి మంచం మీద పాపారావు కాలుమీద కాలేసుకుని జిలేబీ తింటున్నాడు. కొంచెం భోజనప్రియుడు లెండి. అగరొత్తులూ, మల్లెపూల వాసనలతో గది గుబాళిస్తూంది. పాపారావుకి లోపల బెదురుగానే ఉంది.

అంతకు కొద్ది రోజుల క్రితమే రాజు దగ్గర శిష్యరికం పొందాడు పాపారావు. రాజు పూర్తి పేరు సత్యన్నారాయణరాజు! 'సలహాల్రాజు' అని అందరూ అంటూ ఉంటారు కూడా. చిన్న సలహా అయితే కాఫీ టిఫిన్. పెద్ద సలహా అయితే ఒక్క "హాల్లో"— రాజు ఫీజు! చదవడం వల్ల నయితేనేం, అనుభవం వల్ల నయితేనేం రాజుకి ప్రతి విషయంలోనూ ప్రవేశముంది ( అని తను చెప్పుకుంటూ ఉంటాడు ). "రెండు హాల్లోలు" సమర్పించి రాజు దగ్గర తన మొదటి రోజు చెప్పవలసిన డైలాగులన్నీ పాఠంలా బట్టీపట్టి, ఎందుకైనా మంచిదని ఒక కాపీ రాసుకొని జేబులో కూడా పెట్టుకొన్నాడు.

తాయారు లోపలికి వచ్చిందిట.బయట ఉన్న ఆడంగులతో "గడియ బయట పెట్టుకోండి. లోపల గడియ సరిగ్గా పడదు" అని చెప్పి తనే తలుపు వేసేసింది. పాపారావుని చూసి నవ్వి చుట్టూ కిటికీలనీ, బొందుల్నీ పరీక్షించసాగింది. పాపారావు మూర్ఛపోబోయి తమాయించుకొన్నాడు. సలహాల్రాజు చెప్పిన పాఠంలో ఇంకోలా ఉంది. ఆ అమ్మాయి గడపదగ్గిరే బొటనవేలితో పిచ్చి గీతలు గీస్తూ నిలబడి ఉంటుందనీ, పాపారావు దగ్గరి కెళ్లాలనీ ఇంకా ఏవేవో చెప్పాడు.

అంతలో తాయారు ఆ గది అంతా పరీక్షించి, సంతృప్తిపడి పాపారావు దగ్గరికొచ్చి నిలబడింది. సలహాల్రాజు చెప్పిన పాఠంలో మొదటి పేరా తీసేసి, రెండో పేరా నుంచి కంటిన్యూ చేద్దామనుకున్నాడు పాపారావు.

జూలియెట్ లాగా తాయారు నిలబడి ఉందనుకొని, ఆమె ముందు



మోకాళ్ల మీద కూర్చుని రెండు చేతులూ పూర్తిగా చాపి, "తాయారూ— నా జీవన రాగానికి సితారూ" — అని తరవాత డైలాగు మరిచిపోయి, లేచి నిలబడి సీరియస్‌గా జేబులో కాయితం కోసం వెతుక్కోసాగాడు. దిండు క్రింద పరుపు, దుప్పటి దులిపీ అన్నీ గాలించాడు. లాభం లేకపోయింది. తాయారు అతణ్ణి చూసి జాలిపడి నవ్వింది. ఇంక ఆ కాయితంతో లాభం లేదనుకొని పాపారావు తాయారుని దగ్గిరికి తీసుకొన్నాడు. తాయారు అతని మెడచుట్టూ రెండు చేతులూ వేసి చెవి దగ్గరగా నోరు పెట్టి ఆనందంగా ఈల వేసింది. ఒక్క క్షణం పాపారావు కేమీ అర్థం కాలేదు. తాయారు మళ్లీ ఈల వేసింది. పాపారావు అదిరిపోయాడు. దయ్యమేమోనని క్షణం బెంగపడ్డాడు. ధైర్యంచేసి అదే అడిగాడు. తాయారు కోపగించుకొని బయటికి పోబోయింది. పాపారావుకి తొలి రాత్రి ఆ విధంగా పాడవడం ఇష్టంలేకా, సత్యన్నారాయణ రాజు చెప్పిన చివరిదీ, ఆఖరుదీ అయిన సలహా జ్ఞాపకం వచ్చి తాయారుని లాలించాడు.

శోభనం గది బయట పేరంటాళ్లకి మాత్రం గదిలోనుంచి ఈల పాటలు వినిపించాయి. "పెళ్లికొడుకు చాలా హుషారుగా ఉన్నాడు" అనుకొన్నారు— తాయారు సంగతి తెలియని పేరంటాళ్ల మాత్రం.

ఇలా మొదలయింది పాపారావు ఈల బాధ. పొగడ చెట్టు క్రింద విరాగిలా కూర్చుని ఉన్న పాపారావు, క్రిందటి ఆటలో ఆల్ కౌంటు ఇచ్చి, ఈ ఆటలో రాంగ్ షో చూపించి దొరికిపోయిన వాడిలా దిగాలుగా ఉన్నాడు. మొన్న సినిమాలో జరిగిన సంఘటన జ్ఞాపకం వచ్చి అతడికి ఉబికి ఉబికి దుఃఖం రాబోయింది. అసలేం జరిగిందంటే—

ఉద్యోగం రాని క్రితం పాపారావు ఎప్పుడూ సినిమాకి బెంచీకే వెళ్ళేవాడు. పెళ్లయ్యాక భార్యను తీసుకొని సినిమాకి వెళ్లడం అదే ప్రథమం. 'కల్పనా'లో ఒక తెలుగు సినిమా ఆడుతూంది. ఆ సినిమా కాకినాడకి ఏ పదోసారో రావడం. తాయారుకి స్టంటు తెలుగు సినిమాలంటే మహా ఇష్టం. పాత సినిమా అయినా దానికే వెళదామంది. పాపం, పాపారావు కేం తెలుసు? ఎప్పుడూ శ్రీరామ పట్టాభిషేకం లాంటివి చూస్తుంటాడు. 'సరే' అంటూ సినిమాకి బయలుదేరదీశాడు భార్యని.

రిక్షా దిగి అలవాటు ప్రకారం ఎవళ్ళైసా పల టిక్కెట్టు వైపు దారితీయబోయి ప్రక్కనే భార్య ఉందని గ్రహించి కుర్చీ టిక్కెట్టు తీసుకుంటే భార్య దృష్టిలో చులకన అయిపోతానని అభిమానపడి, రెండు రిజర్వుడు టిక్కెట్లు తీసుకున్నాడు సత్యన్నారాయణరాజు సలహా ప్రకారం.

తాయారు పాపారావుకంటే నాలు గంగుళాలు పొడవు. ఇద్దరూ హాల్లోకి ప్రవేశించగానే అందరి కళ్ళూ వాళ్ల మీదే నిలిచినాయి. రిజర్వుడు క్లాస్‌లో కాలేజీ అమ్మాయిలూ, అబ్బాయిలూ చాలా మంది ఉన్నారు. పాత స్టంటు సినిమాలంటే ఈ మధ్య అబ్బాయిలూ, అమ్మాయిలూ ఎందుకో తెగ ఇష్టపడుతున్నారు. అబ్బాయిల అల్లరి మామూలేగా.

పాపారావుకి ఆ క్లాస్‌లో ఎక్కడా రెండు సీట్లు పక్క పక్కగా కనిపించ



లేదు. తాయారుకి అమ్మాయిల మధ్య ఓ సీటు ఖాళీగా దొరికితే అందులో వెళ్ళి కూర్చుంది. ఆ వెనక వరసలో తాయారు సీటు వెనక కుర్చీలో పాపారావు కూలబడ్డాడు.

సినిమా మొదలయింది. ఒక చోట హీరో, కొండ దొంగ ఒకడూ తీవ్రంగా దెబ్బలాడుకుంటున్నారు — అబ్బాయిల లోంచి ( రిజర్వుడు క్లాస్‌లోంచి ) ఎవరో గట్టిగా ఈల వేశారు. వెంటనే ఆ ఈలకి మంచి 'రెస్పాన్స్' వచ్చింది. హాలంతా విజిల్స్‌తో నిండిపోయింది.

అమ్మాయి లిదంతా చూస్తున్నారు. అందులో ఒక అమ్మాయి ఉండబట్టలేక అనేసింది — "మనం మగవాళ్ళతో ఇంచుమించుగా సమానమే కానీ, ఈల మాత్రం వేయలేకపోతున్నాం" అని. అంతా చాలా సీరియస్‌గా బాధపడ్డారు. అంతలో హాలంతా నిశ్శబ్దం అయిపోయింది. కొండ చివర హీరో, విలన్‌లు పోరాడుతున్నారు. విలన్ క్రింద పడిపోయాడు. అంతే. నోట్లో వేలుపెట్టి, నాలుక మడత వేసి హాలు దద్దరిల్లిపోయేలా ఈల కొట్టింది తాయారు.

చాలా సీరియస్‌గా సినిమా చూస్తున్న పాపారావు పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపోయాడు. అమ్మాయిలంతా తాయారువైపూ, తమలో తామూ చూసుకొన్నారు. అమాంతం సినిమా ఆగిపోయింది. లైట్లు వెలిగాయి. తాయారు విజయగర్వంతో అమ్మాయిల వైపు చూసింది.

పాపారావు అధఃపాతాళం ఎక్కడున్నా కనపడుతుందేమోనని వెతుక్కుంటూ ఉన్నాడు. అమ్మాయిలంతా చప్పట్లు కొట్టి తాయారుకి 'కంగ్రాట్స్' చెప్పారు.

"మీ ఇల్లెక్కడండి?" ఒకఅమ్మాయి అడిగింది.

"రామారావుపేటలో — ఈశ్వరా లైబ్రరీ దగ్గర" అని చెబుతూంది తాయారు. పాపారావు తాయారు చెప్పేవన్నీ వింటున్నాడు. వాళ్ళంతా ఈల నేర్చుకోవడానికి ఇంటికి వస్తారట. అలాగే రమ్మంటూంది తాయారు. 'ఔరా!' అని ముక్కు మీద వేలేసుకున్నాడు పాపారావు. అంతలో రీలు తెగిపోయిన సినిమా మళ్ళీ మొదలయింది.

మళ్ళీ యుద్ధం సీను వచ్చేసరికి తాయారు ఈల వెంబడి ఈల వేయడం మొదలుపెట్టింది. దానికి అమ్మాయి లంతా సపోర్టు.

హాల్లో పొగ తాగిన వారిని శిక్షించే నిమిత్తం వారిని హాలు బయటికి తీసుకుపోయి వారి దగ్గర కొద్దో గొప్పో స్వీకరించి వదిలేసే పోలీసు లిద్దరికీ, అబ్బాయి ఎవరైనా అమ్మాయిల మధ్యలో కూర్చుని ఈల కొడుతూ పబ్లిక్ న్యూసెన్స్ చేస్తున్నాడేమోనని అనుమానం వచ్చింది. తాయారు దగ్గరికి వచ్చి పరిశీలనగా చూడసాగారు.

పాపారావు ఇంక సహించలేకపోయాడు. వెంటనే చివాల్న కుర్చీలోంచి లేచి, "తాయారూ, తలనొప్పిగా ఉంది. నేను వెళుతున్నాను" అంటూ బయలుదేరాడు. తాయారు తన కుర్చీలోంచి లేచి పతి ననుసరించింది. విషయం అర్థమయిన పోలీసు లిద్దరూ అక్కడే బీడీలు వెలిగించి, దమ్ము లాగి సర్దుకున్నారు.

పాపారావు బయటికి వచ్చి తాయారుతో సహా రిక్షా ఎక్కి ఇంటికి చేరాడు. లోపలికి రాగానే, "తాయారూ, నువ్వలా ఈల వేయచ్చా" అంటూ సన్నగా చీవాట్లు వేశాడు. "మీ మగవాళ్ళ వేయచ్చేం!" అంటూ మళ్ళీ వేయబోయింది. "నాకు కోసం తెప్పించకు" అన్నాడు భయపడుతూనే. ఎందుకంటే, తాయారు బరువూ, ఎత్తూ పాపారావు కంటే ఎక్కువే.

• • •

పాపారావు బాధపడుతూ సిమ్మెంటు బెంచీమీదనించి లేచి బయటికి వచ్చాడు పార్కులోనించి. చతుర్ముఖ పారాయణం వైపు దారి తీయబోయి, అది నెలాఖరు ఆదివారమనీ, అందువల్ల జేబులో డబ్బుల్లేవనీ గుర్తుకొచ్చి ఇంటికి బయలుదేరాడు.

పాపారావు భోజనంచేసి పడకగదిలో తీరిగ్గా కూర్చుని ఉండగా ఇంటిముందు రెండు రిక్షాలు ఆగి, నాలుగు సీతాకోక చిలుకలు దిగినాయి. పాపారావు కిటికీలో నుంచి చూస్తూండగానే, తాయారు గారి ఇల్లు ఇదేనా అని వాళ్ళు అడగడం, తాయారు లోపలినుంచి వచ్చి ఎవరు కావాలండీ అని అడగడం జరిగినాయి. పాపారావు ఆశ్చర్యపడుతూ ఉండగానే వాళ్లలో ఒకఅమ్మాయి "మీరే కావాలండీ. ఆ రోజు సినిమా హాల్లో సంగతి మరిచిపోయిన ట్లున్నారు" అని అంది.

తాయారు హుషారుగా ఒక్కసారి ఈల వేసి — "రండి రండి, మరిచేపోయాను సుమండీ" అంటూ ఆహ్వానించింది.

పాపారావు కుక్కిన పేనులా మంచం మీద పడుకొని నెలకి సరిపడా తెచ్చిన ద్రాక్ష, జీడిపప్పు మళ్ళా తెచ్చుకోవలసిన అవసరం గురించి ఆలోచించసాగాడు.

హాల్లో అమ్మాయిలు గుసగుసగా మాట్లాడుకుంటున్నారు. పాపారావుకి వాళ్ళ మాటలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి.

"ఇవన్నీ ఎందుకండీ?"

"మరేం ఫర్వాలేదు. నేను మీ ఇంటి కెప్పుడయినా వస్తే ఏమీ పెట్టనవసరం లేదు లెండి" అని పెట్టి, "సమయానికి మా వారు ఇంట్లో లేరు. ఉంటే ఎంతో సంతోషిద్దురు" అని పడగకది దగ్గరికి వెళ్ళి బయట గొళ్ళెం పెట్టేసింది.

పాపారావు పక్కమీద నుంచి ఎగిరి కూర్చున్నాడు. 'బయటికొక్కడా పోనివ్వకుండా ఏమి టీ బందిఖానా' అని తాయారు మీద బోలెడు కోప్పడిపోయి, దానితో ఏమీ లాభంలేదని తెలిసినవాడై, ఒకవేళ తలుపు తీయమన్నా అందరి ముందూ ఏమైనా అంటుందేమోనన్న భయంచేత మంచం మీదే పడుకొని బయట వాళ్ళ మాటలు వినసాగాడు.

"మీరేం చదువుతున్నారండీ?" అని అమ్మాయిల నడిగింది తాయారు.

"ఈవిడ నర్మద, ఇది రాజేశ్వరి, ఈ అమ్మాయి పేరు అనూరాధ, ఇక నా పేరు పద్మ" అంటూ ఓ అమ్మాయి పరిచయ కార్యక్రమాన్ని ముగించింది. "మేమంతా ఉమెన్స్ కాలేజీలో బి. ఎస్‌సి. ఫైనలియర్ చదువుతున్నాం."

"నా పేరు తాయారు. అదిగో ఆ ఫోటోయే మా వారు. పేరు నే చెప్పకూడదు లెండి. ఆయన స్టేట్ బాంక్‌లో కాషియరు."

పాపారావు గదిలో మండిపోతున్నాడు, తాయారు నక్క వినయాలు వినలేక.

"అవునూ, ఆ రోజు సినిమా మధ్యలో అలా ఎందుకు వెళ్ళిపోయారు?" అంది ఒక నీరజాక్షి.

"మా వారికి మధ్యలో భరించలేనంత తలనొప్పి వచ్చిందండీ. ఇంటి కొచ్చిన తరవాత ఆ రాత్రంతా దగ్గర కూర్చొని, అమృతాంజనం రాసీ, పట్టు వేసీ, అది చేసీ, ఇది చేసీ, నానా అవస్థలూ పడితే, చివరికి ఎలాగయితేనేం ఏ అర్ధరాత్రో నిద్రపోయారు" అంది తాయారు.

"మీవారు రెప్పుడు వస్తారండీ?" అంటూంది ఓ అమ్మలమిన్న.



పెంపకం సరిగా లేని బాలుని జీవితం ఇతివృత్తంగా రచించిన 'గాలిపటాలు' నాటకం ఇటీవల న్యూఢిల్లీలోని సప్రూ హౌస్‌లో ప్రదర్శించారు. ఈ నాటకాన్ని సి. బి. ఐ. లో ఇన్‌స్పెక్టర్-జనరల్‌గా పనిచేస్తున్న శ్రీ ఎస్. వేణుగోపాలరావుగారు రచించారు. ఈ నాటకం న్యూఢిల్లీలోని రామకృష్ణాపురం తెలుగు పాఠశాల నిధి సహాయార్థం ప్రదర్శించబడింది. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తి శ్రీ తాతాచారి అధ్యక్షత వహించారు. ఈ నాటకానికి దర్శకులు శ్రీ పి. ఎస్. రామారావు.

"ఎందుకూ?" అని వెళ్లి అడుగుదా మనుకున్నాడు పాపారావు. బాగోదని ఊరుకున్నాడు.

"సాయంత్రందాకా రారండీ — ఊరెళ్లారు" అంది తాయారు.

ఒక క్షణం నిశ్శబ్దం.

"మీ రంత గట్టిగా ఎలా ఈల వేస్తారండీ? అసలు మీ రిలా ఈల వేయడం మీ వారికి ఇష్టమేనా?" అని పత్రికా విలేఖరులులా ప్రశ్నలు గుప్పించారు. తాయారు అన్నింటికీ ఓపిగ్గా సమాధానాలు ఇస్తోంది. "మా వారూ, నేనూ కలిసి మెలిసి ఉంటామండీ ఎప్పుడూ. నన్ను ఈల వేయమని ఆయనే ప్రోత్సహిస్తూంటారు. తన జీవన గానానికి నా 'ఈలే' పల్లవి అని కవిత్వం చెబుతూ ఉంటారు కూడా."

ఒళ్లు మండిపోతూంది పాపారావుకి. మంచం మీదనించి దిగి అటూ ఇటూ పచార్లు చేయసాగాడు.

"సరే, ఇక పాఠం మొదలు పెడదామా" అని ఒక అమ్మాయి అనేసరికి అంతా ఘొల్లున నవ్వారు.

నవ్వులు తగ్గిన తరవాత "ఇదిగో ఈల అంటే ఇలా వేయాలి" అని నోట్లో వేలుపెట్టి, నాలుక మడతవేసి, విజిల్ వేసింది. అంతా చప్పట్లు చరిచారు.

ఆ తరవాత ఒకరి తరవాత ఒకరు ప్రయత్నించారు. కానీ, ఎవరూ వేయలేక పోయారు.

"మీరు ప్రయత్నించి చూడండి. నేను పొయ్యిమీద ఎసరు పడేసి వస్తాను" అంటూ తాయారు ఇంట్లోకి వెళ్లింది.

హాలులో ప్రాక్టీసు మొదలైంది. ఇలాగే ఇంకెంతమందిని ఈలకత్తెలుగా తయారుచేసి వాళ్ల మొగుళ్లని బాధ పెట్టమంటుందో — అని అనుకుంటూ తల పట్టుకున్నాడు పాపారావు.

బయట ఇష్టారాజ్యంగా ఈల ప్రాక్టీసు సాగుతూంది. అంతలో ఒకమ్మాయి తన ప్రయత్నంలో సఫలీకృతురాలై గట్టిగా ఈల వేసింది. ఈల వెంట ఈల. అందరికి వచ్చేసినట్టే. గదిఅంతా విజిల్స్‌తో నిండిపోయింది.

పాపారావుకి భూమి గిర్రున తిరుగుతున్నట్లు అ...చింది. గోడమీదున్న కాలెండరులో ఆంజనేయులు నవ్వుతున్నట్లు అనిపించింది. పిడికిళ్లు ఆవేశంతో మూసుకున్నాయి.

హాలులో గోల ఎక్కువైంది. ఆ ఇంట్లో ఏమయినా గొడవ అవుతుందేమోనని పక్కింటి వాళ్లు ఒకరిద్దరు తొంగి చూసి వెళ్లిపోయారు.

పాపారావు ఉన్న గది కిటికీ వీథివేపున ఉంది. హాల్లో తొంగిచూసి వెళ్లిపోతూ వాళ్లలో వాళ్లు అనుకున్న మాటలు పాపారావు చెవిలో పడ్డాయి. "మొగుడు అడారివాడైతే పెళ్లాలు మొగుళ్లవుతారు. ఈ అమ్మాయిని ఈ ఇంట్లో కొచ్చిం దగ్గర్నుంచీ చూస్తున్నాను. మొగుడంటే ఇంత పిసరు లెక్కలేదు సరికదా, పైగా మొగుడే ఈ అమ్మాయికి భయ పడతాడు."

ఈ మాటలు పాపారావును తాయారు వేసిన ఈల కంటే ఎక్కువ బాధ పెట్టి నాయి! కాలెండరు వైపు చూశాడు. ఆంజనేయులు దీవిస్తున్నట్టు కన పడ్డాడు. ఏదో కొత్త బలం వచ్చినట్టు హుంకరించాడు.

"నేను వన్, టూ, త్రీ అనగానే అంతా ఒక్కసారి ఈల వెయ్యండి చూద్దాం" అని ఆఖరి పాఠం చెబుతూంది తాయారు.

"సరే, సరే" అన్నా రందరూ.

"వన్ ... టూ ..."

"తాయారూ! తలుపు తియ్యి ..." అని ఒక్కసారి గర్జించాడు పాపారావు.

అంతా ఉలిక్కిపడ్డారు. ఒక్క క్షణం హాలంతా నిశ్శబ్దమయిపోయింది. అమ్మాయిలకి ఏమీ అర్థం కాలేదు. పడకగదివైపూ, తాయారు వైపూ చూశారు. తాయారు అంతలో సర్దుకొని — "కూర్చుందురూ, హాల్లో ఆడవాళ్లున్నారు" అంది.

"తలుపు తీస్తావా, తన్న మన్నావా!" బెడ్ రూమ్‌లో నుంచి కేక వినిపించింది.

"ఎంత ధైర్యం? రండి. ఎలా తంతారో చూస్తాను" అని నడుం బిగించింది తాయారు.

అమ్మాయిలంతా విస్తుపోయి, ఈలసంగతెలా ఉన్నా ఇక్కడేదో ఘోరావమానం జరుగుతుందేమోనని భయపడడం మొదలు పెట్టారు. "మీకేం భయం లేదు" అని వాళ్లకో అభయ హస్తం చూపించి వెళ్లి గొళ్లెం తీసింది.

పాపారావు ఆవేశంతో రొప్పుతూ హాల్లోకి వచ్చిపడ్డాడు. అమ్మాయిల వైపు తిరిగి— "మీకు సిగ్గు ఎగ్గూ లేదా? ఈల నేర్చుకొంటే ఫలితం ఏమిటో ఇప్పుడు చూద్దురు గాని" అన్నాడు.

"ఏమిటండీ చూసేది? పరాయి వాళ్ల ముందు ఎప్పుడూ లేంది — ఇలా అవమానిస్తారా?" అంటూ ఆడపులిలా పాపారావు మీదకు దూకబోయింది తాయారు.

పాపారావు వంటింట్లోకి పరిగెత్తాడు. హాల్లో అమ్మాయిలకి ఇదంతా సినిమాలా ఉంది. అంతలో పాపారావు బయటి కొచ్చాడు. ఈసారి చేతిలో కత్తిపీట ఉంది.

పాపారావు అవతారం చూసి తాయారే భయపడింది. పాపారావు విజృంభించాడు. ఇకముం దేం జరుగుతుందోనన్న ఆలోచన లేకుండా, ఏదో సినిమాలో రాకుమారుడు మంత్రగత్తె జుట్టు కోసేసినట్టు తాయారు మెడ వంచి జుట్టు పరపరా కోసేశాడు.

నలుగు రమ్మాయిలూ అది చూసి పరుగెత్తి వెళ్లి పోయారు బయటికి.

తాయారు ఏం జరిగిందో తెలుసుకొనే లోపున చేతిలో కొచ్చిన జడను విసిరేసి, "నువ్వేసిన వేషాలకి అసలు చంపేద్దును. పట్టే మనిషివి కావని ఇంతటితో వదిలాను. ఇప్పుడు పోవే పుట్టింటికి పోతావో, ఉప్పుటేట్లో దూకు తావో" అంటూ వీథి తలుపు గడియ వేసి మళ్లీ తాయారు దగ్గిర కొచ్చాడు.

మోకాళ్ల మీద తల పెట్టుకుని తాయారు ఏడుస్తోంది. పాపారావుకి జాలివేసింది. "తాయారూ? ఎందుకు చెప్పు, నన్ను బాధపెట్టడం — నువ్వు బాధపడడం" అన్నాడు బాధపడుతూ.

తాయారు తల ఎత్తి— "క్షమించండి. ఇంకెప్పుడూ ఈల వేయనుగా" అంది.

కత్తిపీట వదిలేశాడు పాపారావు.

"ధన్" మని చప్పుడయింది. మెలకువ వచ్చింది పాపారావుకి. వంటింట్లో డబ్బా ఏదో క్రింద పడినట్టుంది. పక్కకి తిరిగి చూశాడు. తాయారు లేదు. 'తెల్లవారి పోయిందన్న మాట!' అనుకొన్నాడు.

అంతలో తాయారు స్నానాల గది లోంచి బయటి కొచ్చి పక్క గదిలోకి వెళ్లిపోయింది. తలారా స్నానం చేసిందేమో, అందంగాజుట్టు భుజాలమీదనించి క్రిందికి జారుతూంది. పాపారావు తలగడాలో తల దాచుకొని గుండెల నిండా గాలి పీల్చుకొన్నాడు.

పక్క రూములోంచి సన్నగా ఈల వినిపించడం మొదలెట్టింది, సుప్రభాతం ట్యూన్‌లో. ★



నన్ను చూడు నా అందం చూడు

ఫోటో—బి. సుధాకరరావు (నల్గొండ)